కోవిడ్-19 విస్తరణ : సామ్రాజ్యవాదం

వంద సంవత్సరాలకు ఒకసారి వచ్చే 'ప్రాణాంతక వ్యాధుల'లో ఒకటైన కోవిడ్ ఔషధ రంగంలో కనీవినీ ఎరుగని పోటీకి ప్రపంచ వ్యాప్తంగా తెరతీసింది. వ్యాక్సిన్లను తామే ముందుగా తీసుకువచ్చి ప్రపంచ మార్కెట్‌ను కొల్లగొట్టడం కోసం, ప్రపంచవ్యాప్తంగా ఉన్న కార్పొరేట్‌శక్తులు ఒకరితో ఒకరు పోటీ పడుతున్నారు. ప్రపంచీకరణ మునుపెన్నడూ లేనట్టుగా మార్కెట్‌లతో పాటు వైరస్‌లను, జబ్బులను, ఆకలిని భూమి మీది ప్రతీ మూలకూ చొచ్చుకుపోయేలా చేసింది. పెట్టుబడిదారీ విధ్వంసం అమెజాన్‌ను తాకటమే కాకుండా, దాని మారుమూల ఆదివాసీ తెగలకు కూడా కోవిడ్‌ను వ్యాపింప చేసింది. సహజంగానే అన్ని పెట్టుబడిదారీ దేశాల ప్రభుత్వాలు తమకు ప్రభుత్వరంగంలో వ్యాక్సిన్లు తయారుచేయడానికి అవసరమైన అన్ని వనరులు ఉన్నప్పటికీ, బహుళజాతి కార్పొరేషన్‌లకు నిధులు సమకూర్చటం, వారికి మాత్రమే ముందస్తు ఆర్డర్‌లు పెట్టడం ద్వారా వ్యాక్సిన్లను సమకూర్చు కోవడానికే పరిమితమయ్యారు. పెట్టుబడిదారీ విధానం ఈ పాండమిక్‌ను ఉపయోగించుకుని తన సంక్షోభం నుంచి బయటపడి తిరిగి ప్రపంచ దేశాల పైన, ప్రజల పైన తన పట్టు బిగించాలని చూస్తున్నది.

సామ్రాజ్యవాద దేశాల నియంత్రణలో వ్యాక్సిన్లు

కరోనా వైరస్ మహమ్మారి యొక్క తీవ్రతను అంగీకరించటానికి అమెరికా తొలుత నిరాకరించి, స్థానిక నల్లజాతీయులు, లాటిన్ అమెరికా దేశస్తులు నివసించే శివారు ప్రాంతాల్లో లక్షలాది మంది మరణానికి కారణమయ్యింది. ఈ విధంగా పెట్టుబడిదారీ దేశాల్లో కూడా పెట్టుబడిదారీ సంక్షోభ భారం పేదలపైనే పడుతుందని నిరూపించింది. భారతదేశం, బ్రెజిల్ కూడా ఈ అలక్ష్యం విషయంలో అమెరికాను అనుసరించాయి. కానీ ప్రజాబాహుళ్యం నుండి బలమైన ఎదురుదెబ్బ తగిలాక ట్రంప్ బృందం యుద్ధప్రాతిపదికన వ్యాక్సిన్లు తయారు చేయడానికి 'ఆపరేషన్ వార్ స్పీడ్' చేపట్టి 10 బిలియన్ల డాలర్లను ఒక్కసారిగా విడుదల జేసింది. ఇందులో 100 మిలియన్ వ్యాక్సిన్ డోసులకు గాను 'ఫైజర్' కంపెనీకి 1.95 బిలియన్ డాలర్లు, 'మోడర్నా' కంపెనీకి 1.5 బిలియన్ డాలర్లు ఇచ్చింది.ఒకవేళ వ్యాక్సిన్ అత్యవసర అనుమతిని పొందటంలో విఫలమయినా కూడా చెల్లిస్తామన్న హామీని ఇచ్చింది. మరో నాలుగు ఔషధ కంపెనీలు కూడా ఈ 'ఆపరేషన్'లో భాగస్తులయ్యి ప్రజల సొమ్మును కొల్లగొట్టడంలో తమ వంతు కృషిని చేసాయి.

మొత్తం మీద అమెరికా తన దేశ జనాభా కన్నా అదనంగా మూడు రెట్లమందికి సరిపడేటన్ని వ్యాక్సిన్లను కొనుగోలు చేసింది. అమెరికన్లు ముందుగా వ్యాక్సిన్లు వేయించుకునేలా చూసుకోవడమే కాకుండా, ఇలా నిల్వచేసి దాచి పెట్టడం ద్వారా అనేక వ్యాక్సిన్ డోసులు నిరుపయోగం అవుతాయని కొంత విమర్శలు వచ్చాక, అదనంగా ఉన్న కొన్ని వ్యాక్సిన్లను మెక్సికో, కెనడాలకు పంపిణీ చేయడానికి జో బైడన్ అంగీకరించాడు. తన సరిహద్దు దేశాలు వ్యాక్సిన్లు వేయించుకోక పోతే తిరిగి వైరస్ తమకు సంక్రమిస్తుందనే భయమే తప్ప ఇందులో ఔదార్యమేమీ లేదు. నిజానికి అమెరికన్ పాలకుల భాషలో చెప్పాలంటే ఈ వ్యాక్సిన్లు తర్వాత కాలంలో ప్రజలు చెల్లించాల్సిన తప్పనిసరి రుణాలే.

యూరోపియన్ యూనియన్ తమ దేశాల్లోని సుమారు 375 మిలియన్ల వయోజన జనాభా కోసం 1600 మిలియన్ల వ్యాక్సిన్ డోసుల కొరకు ఆర్డర్ చేసింది. బ్రిటన్ తన 54 బిలియన్ల వయోజనులకు పూర్తిస్థాయి వ్యాక్సినేషన్ కోసం 219 మిలియన్ డోసులు అంటే 165 మిలియన్ డోసులు అదనంగా ఆర్డర్ చేసిందన్నమాట. అదే సందర్భంలో కెనడా తన ప్రభుత్వరంగపు వ్యాక్సిన్ ల్యాబ్‌ను ప్రైవేట్ పరం చేసి తన వ్యాక్సిన్ కార్యక్రమం వెనుకబడి ప్రజల ప్రాణాలు పోయిన తర్వాత తమ దేశంలోని 32 మిలియన్ల వయోజనులకు పూర్తి వ్యాక్సినేషన్ కోసం 188 మిలియన్ పూర్తి డోసుల కొరకు ఆర్డర్ చేసింది. (156 మిలియన్ డోసులు అదనం). ఫైజర్ కంపెనీ జర్మన్ భాగస్వామి అయిన 'బయోఎన్‌టెక్'కి జర్మనీ ప్రభుత్వం ప్రేమతో 445 మిలియన్ డాలర్లు చెల్లించింది. పెట్టుబడిదారీ దేశాలు అవసరానికి మించి ఎన్నోరెట్లు అధిక డోసులు కొనుగోలు చేయడం వలన పేదదేశాలకు ఇప్పటికీ వ్యాక్సిన్లు అందుబాటులో లేకుండాపోయాయి.

కృత్రిమ కొరతను సృష్టించిన పెట్టుబడిదారులు

ప్రజల సొమ్ముతో తయారైన ఈ వ్యాక్సిన్లు ప్రజలందరికీ త్వరితగతిన అందాలంటే ప్రభుత్వం తమ నిధులతో పనిచేస్తున్న ఔషధ కంపెనీలకు కొన్ని షరతులు విధించాలి. అవి – ముందుగా వ్యాక్సిన్ తయారుచేసిన సంస్థలు తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇతర వ్యాక్సిన్ తయారీదారులకు బదిలీ చేయడం, ఖర్చుల గురించి పారదర్శకంగా ఉండాలని లేదా వారి వ్యాక్సిన్ల తయారీకయ్యే ఖర్చు ధరకే అమ్మాలని షరతులు విధించడం. కానీ ఏ ప్రభుత్వమూ ఏ షరతులూ విధించలేదు.

ఈనాడు మనకు ప్రపంచవ్యాప్త పంపిణీ వ్యవస్థతో పాటు అత్యంత అధునాతన సాంకేతిక పరిజ్ఞానం కూడా ఉండడంతో అవసరాలకు సరిపడా వ్యాక్సిన్లు తయారుచేసి ఒక్క నెలరోజుల్లోనే మొత్తం ప్రపంచ ప్రజలందరికీ వ్యాక్సిన్లు ఇచ్చి అందరికీ రోగ నిరోధక శక్తి

పెంపొందించే సామర్థ్యం ఉంది. కానీ లాభాలే తమ పరమావధిగా ఉన్న పెట్టుబడిదారీ వ్యవస్థ దీనిని జరగనివ్వదు. అందులోనూ ఇంత భారీ సంక్షోభం అంటే అత్యంత అధిక లాభాలు ఒనగూరే సమయం. కాబట్టి వారికున్న పేటెంట్ హక్కుల యంత్రాంగం, ద్వైపాక్షిక ఒప్పందాలు, ప్రపంచ వాణిజ్య సంస్థను ఉపయోగించి వ్యాక్సిన్ల అందుబాటుని – తద్వారా ఆయా దేశాల సార్వభౌమత్వాలని శాసించ గోరతారు.

ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం, తాము అభివృద్ధిచేస్తున్న వ్యాక్సిన్ (కోవీషీల్డ్) సాంకేతిక పరిజ్ఞానాన్ని బహిర్గతపరుస్తామని, తయార ు చేయగల సామర్థ్యం ఉన్న ఎవరైనా దానిని పునరుత్పత్తి చేయవచ్చునని ప్రారంభంలో వాగ్దానం చేసింది. దురదృష్టవశాత్తూ అన్నిదే శాల ఆరోగ్య రక్షణ వ్యవస్థలను తనదైన సామ్రాజ్యవాద స్నేహపు ఆధిపత్యంతో శాసిస్తున్న బిల్ & మిలిందా గేట్స్ ఫౌండేషన్ ఆక్స్ ఫర్డ్ విశ్వవిద్యాలయంపై ఏదో ఒక ఫార్మా కంపెనీతో భాగస్వామి అయ్యేలా ఒత్తిడి తెచ్చింది. దాంతో బ్రిటిష్, స్వీడిష్ ఫార్మా కంపెనీ అ యిన ఆస్ట్రాజెనికాకు సర్వహక్కులు కల్పిస్తూ ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం ఒప్పందం చేసుకుంది. కోవిడ్ మహమ్మారి విజృంభిస్తున్న కొత్తలో ఆస్ట్రా జెనికా తమ వ్యాక్సిన్‌ను లాభరహిత ధరలకు విక్రయిస్తానని ప్రతిజ్ఞ చేసింది. కానీ ఫైజర్, మోడెర్నా కంపెనీలు రెండూ కూడా తమ వ్యాక్సిన్లను తయారీ ధరకు అమ్మబోమని చెప్పాయి. తర్వాత ఆస్ట్రాజెనికా కూడా వెనక్కి లాగబడింది.

వాస్తవంలో సామూహిక వనరులు, పరిజ్ఞానంతో తయారవుతున్న ఉత్పత్తులకు ఫార్మా కంపెనీలు కాపలాదారులుగా మారాయి . ఉదాహరణకి ప్రభుత్వరంగ నిపుణులు, సంస్థల వద్ద ఇప్పటికే ఉన్న సాంకేతిక పరిజ్ఞానం మీద ఆధారపడి బిలియన్ల కొద్దీ ప్రజల నిధుల తో కోవిడ్ వ్యాక్సిన్లు అభివృద్ధి చేయబడుతున్నాయి. ఆస్ట్రాజెనికా వ్యాక్సిన్ పరిశోధన కొరకు ప్రభుత్వాలు, ఛారిటబుల్ ట్రస్టులు 97 % ఆర్థిక వనరులు సమకూర్చినప్పటికీ దానిని అభివృద్ధి పరచిన వారు పూర్తి యాజమాన్య హక్కులు కలిగి ఉన్నారు. భారతదేశంలో కూడా వైరస్‌లో రకాలను, మార్పులను గుర్తించటం, వైరస్‌ను వేరుచేయటం నుంచి ఔషధ పరీక్షలు జరిగే క్రమం వరకు ప్రధాన పరి శోధనా కార్యక్రమ భారం, నిధుల సమీకరణ భారమంతా ప్రభుత్వ రంగ సంస్థలైన CCMB, ICMR, NIV మొదలైనవి వహిస్తుండగా, ప్రైవేటు తయారీ దారులైన సీరం ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (SII), భారత్ బయోటెక్ అభివృద్ధి చేయబ డిన వ్యాక్సిన్‌పై సర్వహక్కులూ పొంది గణనీయమైన లాభాలు ఆర్జిస్తున్నాయి. బిలియన్ల కొద్దీ నిధులు వెచ్చించి అత్యవసరం పేరిట 3వ దశ, 4వ దశ పరీక్షలు నేరుగా ప్రజాబాహుళ్యం పైన నిర్వహించారు, నిర్వహిస్తున్నారు. ప్రభుత్వరంగ సమీకృత వనరులతో ఒకసా రి వ్యాక్సిన్ అభివృద్ధి అయ్యాక తయారీదారు సర్వహక్కులు పొందు తున్నారు. ప్రస్తుతమున్న "ఎవరెక్కువ వేలం పాడితే వాడికి అన్న వ్య వస్థలో" వ్యాక్సిన్లు అన్నీ సంపన్న దేశాల దగ్గర పోగుపడతాయి. వర్ధమాన, పేద దేశాలు వ్యాక్సిన్ల కోసం కొన్ని సంవత్సరాలు నిరీక్షి ంచవలసి వస్తుంది.

పెట్టుబడిదారుల మధ్య వైరుధ్యం

వ్యాక్సిన్లు ఉత్పత్తిచేసే ఏ దేశంలోని ఏ కంపెనీ నుంచి అయినా అన్ని వ్యాక్సిన్లు తానే కొనుగోలు చేస్తానని అమెరికా ప్రకటించిం ది. అంటే వ్యాక్సిన్ తయారీ సంస్థ తన దేశ ప్రజలను కాదని అమెరికాకు ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుంది. అయితే ఇది కార్యరూ పం దాల్చలేదు. యూరోపియన్ యూనియన్ గత నవంబర్‌లో సమాఖ్య లోని అన్ని దేశాల కోసం 300 మిలియన్ డోసులను ఆర్డర్ చేసింది. అయితే వ్యాక్సిన్ అభివృద్ధి, పంపిణీ కార్యక్రమంలో తీవ్రమైన జాప్యం చోటుచేసుకునేసరికి యూరోపియన్ యూనియన్‌లోని బీటలు స్పష్టంగా కనిపించాయి. దాంతో దాని ప్రాంతీయ సంఘీభావ ప్రణాళిక ముగిసిపోయింది. ఫైజర్, బయోఎన్‌టెక్ వ్యాక్సిన్‌ని అ భివృద్ధిచేసిన జర్మనీ, ఆశించిన మేరకు వ్యాక్సిన్లు అందడం లేదని ఫ్రాన్స్, హంగరీ, డెన్మార్క్ లాంటి దేశాలు వ్యాక్సిన్లను తమంతట తాముగా కొనుగోలు చేయడం మొదలుపెట్టి యూరోపియన్ యూనియన్‌ను నీరుగార్చాయి. బెల్జియంలోని ఫైజర్ – బయోఎన్‌టెక్ ,ఆస్ట్రాజెనికా పరిశ్రమలలో ఉత్పత్తి అవుతున్న వ్యాక్సిన్ల సరఫరాపై పట్టు కోసం యూరోపియన్ యూనియన్‌లోని దేశాలు, బ్రిటన్ల మధ్య 'వ్యాక్సిన్ దౌత్యం నుండి వ్యాక్సిన్ దౌర్జన్యం' వంటి రాజకీయ పరిణామాలు చోటుచేసుకొని యూరోపియన్ సమాఖ్య భాగస్వాము ల మధ్య ఉద్రిక్తతలు మరికొంత పెరిగాయి.

బ్రిటన్ తమ దేశ అతిపెద్ద వ్యాక్సిన్ సరఫరాదారు ఆస్ట్రాజెనికాతో మూడు నెలలు ముందుగానే కొనుగోలు ఒప్పందం చేసుకున్న ప్పటికీ, యూరోపియన్ యూనియన్‌కు ఆస్ట్రాజెనెకా జాప్యం చేసినందువల్ల బ్రిటన్‌లోని ఆస్ట్రాజెనెకా పరిశ్రమ నుంచి తమకు వ్యాక్సిన్లు పంపిణీ చేయాలని సమాఖ్య నాయకులు సంస్థను కోరారు. బ్రెగ్జిట్ ఆత్మవిశ్వాసంతో ఉన్న బ్రిటిష్ ప్రభుత్వం, వ్యాక్సిన్లను పొందటాని కి దాని పౌరులకు ప్రాధాన్యత ఉందని చెప్పి అటువంటి మార్పును అనుమతించలేదు. యూరప్‌లో ఉత్పత్తి అయ్యే అన్ని వ్యాక్సిన్‌లపై బ్రి టన్‌కు ఎగుమతి ఆంక్షలను పెడతామని, బెల్జియంలో ఉత్పత్తి చేసిన ఫైజర్, బయోన్ టెక్ వ్యాక్సిన్లను స్వీకరించి బదులుగా తమ కోటా ఆస్ట్రా జెనికా వ్యాక్సిన్లను ఇవ్వాలనీ, అలా ఇవ్వడానికి యూరోపియన్ కమీషన్, బ్రిటిష్ ప్రభుత్వాన్ని ఒప్పించ ప్రయత్నించింది.

సామ్రాజ్యవాదుల వ్యాక్సిన్ ఆధిపత్యం

అమెరికా, యూరప్ ఫార్మా కంపెనీల వ్యాక్సిన్ కొనుగోళ్లు చేయాలంటే కఠినమైన రహస్య ఒప్పందాలు చెసుకోవాలి. ఈ గోప్య

ఒప్పందాల వల్ల ఏఏ దేశాలు ఎంతెంత లోతుగా ఏ ఏ అంగీకారాల మీద ఒప్పందాలు చేసుకున్నాయో మిగిలిన దేశాలకు తెలియదు. దానితో పేద, వర్ధమాన దేశాలు చీకటిలో సంప్రదింపులు జరుపవలసిన స్థితికి నెట్టబడి ఫార్మా కంపెనీల పట్టపగలు దోపిడీకి గురి అవుతున్నారు. అమెరికా కంపెనీ అయిన ఫైజర్, వాక్సిన్ కొనుగోలు ఒప్పందాల పేరుతో ఆయా దేశాల చట్టాలలో జోక్యం చేసుకుంటో ంది. ఫెడరల్ బ్యాంకు నిల్వలు, రాయబార భవనాలు, సైనిక స్థావరాల వంటి దేశాలలోని సార్వభౌమ ఆస్తులను కూడా భవిష్యత్తులో ఏదైనా చట్టపరమైన కేసుల ఖర్చు కోసం హామీగా కోరుతోంది.

అర్జెంటీనా – ఫైజం కంపెనీల మధ్య 2020 జూన్‌లో చర్చలు ప్రారంభమయ్యాయి. ఆ ఒప్పందం ప్రకారం అర్జెంటీనాలో ఫైజర్‌ పై ఎవరైనా సివిల్ వ్యాజ్యం దాఖలు చేసి ఆ కేసులో గెలిస్తే, అర్జెంటీనా ప్రభుత్వం పరిహారం చెల్లించాలి, ఫైజర్ చెల్లించదు. దీనికోస ం అర్జెంటీనా పార్లమెంటు 2020 అక్టోబర్‌లో ఒక కొత్త చట్టాన్ని కూడా ఆమోదించింది. అయితే ఫైజర్ కనీసం తన సొంత నిర్లక్ష్యాలకు పరిహారం చెల్లించాల్సిన అవసరం ఉందని ఆ చట్టం తెలిపింది. ఈ పదజాలం ఫైజర్‌కు రుచించలేదు. దానితో 'నిర్లక్ష్యం' అనే దాన్ని మరింత స్పష్టంగా నిర్వచించి టీకా పంపిణీ, రవాణాలో 'అశ్రద్ధకు మాత్రమే' అని చట్టాన్ని సవరించడానికి అర్జెంటీనా ముందుకు వ చ్చినప్పటికీ, ఫైజర్ దానిని తిరస్కరించింది. ఆ క్లాజ్‌ను పూర్తిగా తొలగించాలని ఫైజర్ చెప్పగా, అర్జెంటినా తిరస్కరించింది. దానితో భవిష్యత్తులో రాగల కేసులకు చెల్లించడానికి 'అంతర్జాతీయ బీమా'ను చేయమని ఫైజర్ అర్జెంటీనాని కోరగా దానికి ఆ దేశం అంగీకరి ంచింది. ఫైజర్ కంపెనీ అక్కడితో ఆగలేదు. తిరిగి 2020 డిసెంబర్‌లో తమ సార్వభౌమ ఆస్తులను "ప్రత్యామ్నాయ హామీగా చూపడం" వంటి అనేక డిమాండ్లతో ముందుకు వచ్చింది. అర్జెంటీనా తన బ్యాంకు నిల్వలను, మిలటరీ స్థావరాలను, రాయబార కార్యాలయాలను పణంగా పెట్టాలని ఫైజర్ వత్తిడి తెచ్చింది.

బ్రెజిల్ ముందు ఫైజర్ కంపెనీ ఈ డిమాండ్లను పెట్టింది

ఫైజర్‌కి అనుకూలంగా విదేశాలలో తనకున్న ఆస్తులను బ్రెజిల్ వదులుకోవాలి;ఆ దేశపు నియమ నిబంధనలు ఫైజర్‌కి వర్తించవు; వ్యాక్సిన డెలివరీలో ఆలస్యం పరిగణనలోకి తీసుకోబడదు. ఒకవేళ జరిగితే ఆలస్యానికి ఫైజర్‌కి జరిమానా విధించకూడదు. వ్యాక్సిన్ దుష్ప్రభావాల విషయంలో ఫైజం అన్ని నిబంధనల నుండి మినహాయించబడుతుంది. అర్జెంటీనా, బ్రెజిల్‌లతో చేయగోరిన ఆ ఒప్పందాలు విఫలమయ్యాయి.

తన రహస్య ఒప్పందాల కారణంగా పేరు వెల్లడించని మరొక దేశం ఫైజర్ ఒత్తిడికి లొంగి దాని దోపిడీ ఒప్పందానికి అంగీకరించి ంది. ఈ దుర్మార్గమైన ఒప్పందాలకు ఆ దేశాన్ని అంగీకరింప జేయటానికి ఫైజర్ మూడు నెలలు తీసుకుంది. ఈ ఆలస్యం విలు వ వేలాది మరణాలు!

ఫార్మా కంపెనీలపై వేసే దావాలకు ప్రభుత్వాలు పరిహారం చెల్లించడం సర్వసాధారణమే. ఉదాహరణకు అమెరికాలో PREP చట్టం (పబ్లిక్ రెమిడీస్ ప్రిపేర్డ్‌నెస్ యాక్ట్) ఫైజర్ & మోడెర్నా లాంటి కంపెనీలకు పూర్తి రక్షణనిస్తోంది. అయితే అనుకోకుండా జరిగిన పొరపాట్లకు మాత్రమే, నిర్లక్ష్యానికి కాదు.

ఇప్పటి వరకూ చిలీ, కొలంబియా, కోస్టారికా, ది డొమినికన్ రిపబ్లిక్, ఈక్వెడార్, పనామా, పెరూ, ఉరుగ్వే లాంటి 9 లాటి న్ అమెరికా, కరీబియన్ దేశాలతో వ్యాక్సిన్ సరఫరా ఒప్పందాలపై ఫైజర్ కంపెనీ సంతకాలు చేసింది. 'తప్పనిసరి గోప్యతా ఒప్పం దాల' కారణంగా ఆ ఒప్పందాల నియమ నిబంధనలు ఏంటనేది ఎవరికీ తెలియదు. ఈ సంవత్సరం ఫైజర్ కంపెనీ వ్యాక్సిన్ అమ్మకాల ద్వారా 15 బిలియన్ డాలర్లు (సుమారు లక్ష కోట్ల రూపాయలు) సంపాదించాలని చూస్తూ వంద దేశాలు, సంస్థలతో సంప్రదింపులు జరుపుతోంది.

కోవిడ్ మహమ్మారి కారణంగా అత్యంత దారుణంగా దెబ్బతిన్న బ్రెజిల్, రష్యా తయారు చేసిన స్పుత్నిక్ టీకాను తిరస్కరించేలా 'దౌత్య సంబంధాల'ను ఉపయోగించినట్లు ప్రజా సంరక్షణ ముసుగున ఉన్న అమెరికాకు చెందిన హెల్త్ & హ్యూమన్ సర్వీసెస్ డిపార్ట్మెంట్ ఒ ప్పుకున్నది.

ఆక్స్‌ఫర్డ్ వ్యాక్సిన్ హక్కులు కలిగి ఉండి, తయారీ ధరకే వ్యాక్సిన్ అమ్మకానికి ప్రారంభంలో వాగ్దానం చేసిన ఆస్ట్రాజెనికా ధనిక దేశా ల వద్ద కంటే ఆఫ్రికా దేశాల దగ్గర డోస్‌కు చాలా ఎక్కువ మొత్తాన్ని వసూలు చేస్తోంది. ఉగాండాలో డోసుకు 07 డాలర్లు, దక్షిణాఫ్రికా లో 05.26 డాలర్లు, అదే ఐరోపా సమాఖ్య కేవలం 2.16 డాలర్లు చెల్లిస్తున్నట్లు వెల్లడైంది.

తిరుగుబాట్లను నివారించే వ్యూహంగా కోవాక్స్

ఈ కోవిడ్ – 19 మహమ్మారి రావటానికి చాలా కాలం ముందు బిల్ & మిలిందా గేట్స్ ఫౌండేషన్ లాంటి సామ్రాజ్యవాద తైనాతీ సంస్థలు ఎలాంటి వైరస్‌లనైనా ఎదుర్కొనేందుకు సిద్ధం కావడానికి, దాని నుండి ఎలా లబ్దిపొందాలో అధ్యయనం చేయడానికి, ప్రజల ఆగ్రహాన్ని అడ్డుకునే ప్రణాళికలతో ముందుకు రావడానికి, కోవిడ్ లాంటి సార్స్ వైరస్‌లపై పరిశోధన కోసం బిలియన్ల కొద్దీ డాలర్లను కేటాయించసాగారు. 2018లోనే వారు కోవిడ్ తరహా మహమ్మారులను ఎదుర్కొనే సంసిద్ధత కోసం కసరత్తులను కూడా నిర్వహించారు. ఈ కోవిడ్ మహమ్మారి రావటానికి ముందు ప్రపంచ వ్యాక్సిన్ అమ్మకాలలో 80శాతం 5 బహుళజాతి కంపెనీల చేతుల్లోనే కేంద్రీకృ

తమయ్యాయి. ఉత్పాదక సామర్థ్యాలు కలిగిన భారతదేశం వంటి దేశాలు 'ట్రిప్స్ వెసులుబాటు' (Trade Related Intellectual Property Rights - flexibilities) –మేధోసంపత్తి హక్కుల వాణిజ్య సంబంధిత అంశాల అంతర్జాతీయ ఒప్పందంను వినియో గించుకుని పేటెంట్ హక్కులను దాటవేయటానికి 'తప్పనిసరి అనుమతులను' (compulsory licencing) రాయల్టీ చెల్లింపుతో వాడుకునేవి.

కానీ సామ్రాజ్యవాద దేశాల ప్రతీకార బెదిరింపులు వారిని అడ్డుకున్నాయి. అలా చేయటానికి ధైర్యంచేసే ఏ దేశాన్నైనా అమెరికా తన '301 ప్రత్యేక నివేదిక' జాబితాలో ఉంచు తుంది. ఆర్థిక ఆంక్షలను వర్తింపచేయడానికి అమెరికా ఈ జాబితాను ఉపయోగిస్తుంది. 'TRIPS' ఒప్పందం జరిగాక గత 20 ఏళ్లలో భారత దేశం 'తప్పనిసరి అనుమతి' విధానాన్ని ఒకే ఒకసారి (2012లో క్యాన్సర్ ఔషధం విషయంలో) వినియోగించుకొంది. అప్పటినుండి ఇప్పటిదాకా–రోజువారీ మరణాలు 4000 పైనే ఉన్న తీవ్రమైన కోవిడ్ పరిస్థితుల్లో కూడా భారత్ వెసులుబాటును వినియోగించడానికి సాహ సించలేదు. ఇలా భారతదేశం ఒక్కటే కాదు, ఉక్రేనియన్ ప్రభుత్వంపై ఫార్మా దిగ్గజం 'గిలియడ్' దావా వేస్తానని బెదిరిస్తోంది. 'తప్పనిసరి అనుమతి విధానాన్ని' ఉపయోగించి పేటెంట్ పొందిన రెండు హెచ్ఐవి ఔషధాలను ఉత్పత్తి చేసినందుకు థాయిలాండ్‌కు అందవలసిన కొత్త మందులను అబట్ కంపెనీ నిలిపివేసింది.

డబ్ల్యుటివో కొన్ని వెసులుబాట్లు కల్పించి నప్పటికీ సామ్రాజ్యవాద దేశాలు ద్వైపాక్షిక, ప్రాంతీయ వాణిజ్య ఒప్పందాలలో కఠినమైన నిబంధనలను పెట్టడం ద్వారా వాటిని దాటవేస్తున్నాయి.

ప్రపంచాన్ని కుదిపేస్తున్న కోవిడ్ కాలంలో దేశాలను 'తప్పనిసరి అనుమతి విధానం' వాడకుండా, పేటెంట్లు లేకుండా ఓపెన్ సోర్స్ చేయకుండా నిరోధించేందుకు సామ్రాజ్యవాదులు తమ నైతిక దివాళాకోరుతనాన్ని బయట పెడుతూ కొత్త పథకంతో ముందుకు వచ్చారు.

గత సంవత్సరం మేక్కిన్సే & కంపెనీ నేతృత్వంలో ఒక రహస్య ప్రక్రియలో ప్రపంచ బ్యాంకు, బిల్ & మిలిందా గేట్స్ ఫౌండేషన్, ప్రపంచ ఆరోగ్యసంస్థ (WHO) లాంటి కొన్ని సంస్థలు పేద దేశాలకు కోవిడ్–19 వ్యాక్సిన్ల అందుబాటుకు ఏకైక మార్గంగా COVAX (కోవిడ్ –19 గ్లోబల్ యాక్సిస్ ఇనీషియేటివ్) ను రూపొందించాయి. పెట్టుబడిదారీ దేశాలను, వారి కార్పొరేట్ సంస్థలను లాభరహిత ధరలకు టీకాలు ఇవ్వమని డిమాండ్ చేయడానికి బదులుగా COVAX రెండు బిలియన్ వ్యాక్సిన్‌లకు ముందస్తు ఆర్డర్ పెట్టడానికి వనరులను సమకూర్చుకొంటుంది. దాని 180 భాగస్వామ్య దేశాలకు ఒకే రేటుతో వ్యాక్సిన్‌ను పంపిణీ చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఇది పేదదేశాల ఆగ్రహాన్ని చల్లారుస్తూ కార్పొరేట్లకు అత్యధిక లాభాలను నిర్ధారిస్తోంది.

ఇందులోని ప్రధాన భాగస్తులందరూ ఫార్మాసూటికల్ పేటెంట్లచే రక్షించబడుతూ, విస్తరించబడతూ, అత్యధిక లాభం పొందతా ఉన్నారు. ప్రపంచ వాణిజ్య సంస్థలో కోవిడ్–19 సంబంధిత పేటెంట్లను మాఫీ చేయాలనే ఒక విస్తృత ప్రతిపాదనను బలంగా అడ్డుకుంటున్న ఐరోపా సమాఖ్య, బ్రిటన్, ఆస్ట్రేలియాలు COVAXకి ప్రముఖమైన దాతలు మరియు మద్దతుదారులు. వారు పేటెంట్ మాఫీకి వ్యతిరేకంగా వాదించడంలో ఈ పథకాన్ని ఉదహరిస్తున్నారు. తద్వారా తమ పేటెంట్ హక్కులకు భంగం కలుగకుండా ఈ COVAXను సృష్టించి వాడుకున్నారు.

వ్యాక్సిన్‌ల అలభ్యత సమస్యను–పేటెంట్లను సృష్టించిన పెట్టుబడిదారులే పరిష్కారాన్ని చెబుతున్నారు. కానీ ఆ పరిష్కారం పేటెంట్లను తొలగించడం కాదు. COVAX సమస్య సృష్టికర్తలే తమ 'పరిష్కారాన్ని' చూపుతున్నారు కనుక అది ఎప్పటికీ పనిచేయకుండా వారు జాగ్రత్త పడతారు.

COVAXలో పాలుపంచుకోవడానికి డోనాల్డ్ ట్రంప్ తిరస్కరించాడు. జో బైడన్ దానిలో చేరారు కానీ, ఆ సంస్థకు అసలు ప్రాధాన్యత ఇవ్వలేదు. కెనడా, యూరోపియన్ యూనియన్ కూడా అదేవిధంగా ప్రవర్తించాయి. పైగా భారత దేశం తన కోటా వ్యాక్సిన్‌లను COVAXకు సరఫరా చేయడం లేదని మొసలి కన్నీళ్ళు కారుస్తున్నారు. బడా ఫార్మా కంపెనీలలాగానే COVAX కూడా తన ఒప్పందాల నిబంధనలను అత్యంత గోప్యంగా ఉంచుతుంది. ఫార్మా గుత్తాధిపత్యానికి దాని సానుకూలత ఫలితంగా COVAX వ్యాక్సిన్ కొరతను పరిష్కరించడంలో విఫలమైంది.

భారతదేశంలో వ్యాక్సిన్ల పరిస్థితి

భారతదేశంలోని అన్ని పాలసీలను సామ్రాజ్యవాద శక్తులు ప్రభావితం చేస్తున్నట్టే కోవిడ్ వ్యాక్సిన్ విధానాన్ని కూడా వారే నియంత్రిస్తున్నారు. భారతీయ తయారీదారులు తక్కువ ధరలకే వ్యాక్సిన్లు ఇస్తామన్నారు. బిలియన్ల కొద్దీ వాక్సిన్ డోసులను అన్యాయమైన ధరలకు విక్రయించడానికి పోగేసిన పెట్టుబడిదారులు ఇది తమ అధిక లాభాలకు ముప్పుగా భావించారు. వారు అమెరికా, జర్మనీల నుండి వ్యాక్సిన్‌ల తయారీకి కావాల్సిన ముడిసరుకుల ఎగుమతిని భారత్‌కు ఆపగలిగారు. దానితో భారత కంపెనీలు ధరలు పెంచేసాయి. సీరమ్ ఇన్స్టిట్యూట్ సిఈవో పూనావాలా మొదట్లో ప్రస్తుతమున్న ధరతో (రు.150) కూడా వారికి తగినంత లాభాలు వస్తాయని పేర్కొన్నారు. కానీ తర్వాత కేంద్ర, రాష్ట్రాలకు వేర్వేరు ధరలను ప్రకటించి బ్రిటన్ పారిపోయాక అక్కడ నుండి అతను ఇంకా ఎక్కువ ధరలను ఉటంకిస్తున్నాడు. ధరలను పెంచడంలో భారత్ బయోటెక్ కూడా దానినే అనుసరించింది. ధరల పెరుగుదల తర్వాత మాత్రమే

వ్యాక్సిన్ ముడిపదార్థాల లభ్యత, మన జాతీయ విధానంపై అమెరికా, బ్రిటన్, జర్మనీలకు చెందిన ఫైజర్, మోడెర్నా, జాన్సన్ అండ్ జాన్సన్ లాంటి బడా ఫార్మా కంపెనీల పట్టును తెలుపుతోంది. చైనాతో మన శత్రుత్వాన్ని పెంచడం ద్వారా చైనా నుండి వివిధ వైద్య పరికరాలు, వాక్సిన్ ముడిపదార్థాలను సాధ్యమైనంత తక్కువ ధరకు దిగుమతి చేసుకొనే అవకాశాన్ని సామ్రాజ్యవాదులు మనదేశం చేత తిరస్కరింప చేయగలిగారు. చైనా వ్యాక్సిన్లు, ఇతర పరికరాలు తక్కువ ధరలకు లభించినప్పటికీ మన ప్రభుత్వాలు దాని నుండి దిగుమతి చేసుకునే స్థితిలో లేవు. అన్ని వ్యాక్సిన్లను కేంద్రం ద్వారా అందిస్తామని తొలుత వాగ్దానం చేసిన యూనియన్ ప్రభుత్వం తర్వాత వెనక్కి తగ్గి, అంతర్జాతీయ బిడ్డింగ్ ద్వారా వెళ్ళమని రాష్ట్రాలకు సూచించింది. ఎవరి ప్రత్యక్ష, పరోక్ష ప్రభావం ఈ మార్పులకు దారితీసిందో చెప్పడం కష్టమేమీ కాదు. వ్యాక్సిన్‌ల డెలివరీలో ఆలస్యం కారణంగా వేలాదిమంది ప్రజలు మరణించటం అనేది మార్కెట్ల కోసం బహుళజాతి కంపెనీల మధ్య పోటీలో చాలా చిన్న విషయం. వ్యాక్సిన్‌ల తయారీలో సుదీర్ఘ అనుభవం ఉన్న మనదేశంలోని శాంతా బయోటెక్‌లో మెజారిటీ వాటాను కొనుగోలు చేసిన బడా ఫార్మా కంపెనీ 'సనోఫీ' వ్యాక్సిన్‌లపై అధికధరలను పొందటానికి కోవిడ్ టీకా తయారీని భారతదేశం నుండి బయటకు తరలించగలిగింది. భయంకరమైన ఈ సంక్షోభ సమయంలో అనేక బిలియన్ డాలర్ల వ్యాపారం ఈ విధంగా బ్రహ్మాండంగా సాగుతోంది.

ముగింపు

ప్రపంచవ్యాప్తంగా కోవిడ్ వ్యాప్తిని చాలామంది పాండమిక్ అని పిలుస్తున్నారు. కావాలని దీనిని పాండమిక్‌గా మారనిచ్చారు కనక ఆ పిలుపు సరైందే. ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ తన సహజ సంక్షోభం నుంచి బయట పడేందుకు నిరంతరం సరికొత్త చిట్కాలను ఉపయోగించుకోవాలనుకుంటుంది. దేశాల మిలటరీ బడ్జెట్లు ఆయాదేశాల జీడీపీ లలో 40-50 శాతాలుగా పెంచుకునేలా ఇంతకాలం చేశారు. ఆయాదేశాల్లో విద్యకు, వైద్యానికి ప్రభుత్వాలు పెట్టే ఖర్చు తగ్గించుకునేలా ప్రపంచబ్యాంకు చేత వత్తిడిలు పెట్టించారు. ఆయా దేశాల ప్రజారోగ్య వ్యవస్థలను పతనావస్థకు నెట్టి, కుటుంబాలు తాముగా వైద్యం కోసం ఖర్చుచేసుకునేలా చేస్తూ వచ్చారు. కార్పొరేట్ వైద్య వ్యాపార కంపెనీలు, ఇన్సూరెన్స్ కంపెనీలు, బడా ఫార్మాకంపెనీల గుత్తాధిపత్యంలోకి ప్రజల ఆరోగ్యాలు చేరిన తర్వాత ఇప్పుడు అనివార్యంగా వాక్సిన్ బడ్జెట్లను వారు ప్రభుత్వాలకు నిర్దేశిస్తున్నారు.వేలకోట్ల డాలర్లు కొల్లగొట్టగలుగు తున్నారు. సర్వవ్యాపిత సంక్షోభం ఫలితంగా మందకొడిగా సాగుతున్న ఉత్పత్తిని, వినియోగాలను సాధ్యమైన అన్ని రంగాలలో పెంచుతూ కుటుంబాలు తాము రేపటికోసం దాచుకున్నదంతా ఇప్పుడు బతికుండడం కోసం ఖర్చు చేసేలా అనివార్యతను సృష్టించారు. కొన్ని రంగాల్లో వచ్చిన సంక్షోభాన్ని మరికొన్ని రంగాలను ముందుకు ఉరికించడం ద్వారా భర్తీ చేసుకోదలిచారు. ప్రపంచ కుబేరుల జాబితాలు, వివిధ దేశాల కుబేరుల జాబితాల వరుస క్రమాలలో మార్పులొస్తాయి. వ్యాక్సిన్, ఫార్మ కంపెనీల యజమానులు ఇప్పుడున్న కొంత మందిని దాటేయనున్నారు. కేవలం వారి అనారోగ్యం కారణంగానే నిరంతరం పేదల సైన్యంలోకి చేరే లక్షల సంఖ్యను ఈ కోవిడ్ కోటాను కోట్లకు చేర్చేలా ఈ పాండమిక్ రూపొందించబడింది. విద్య, వైద్యం, సామాజిక భద్రతకు గ్యారంటీ ఇవ్వగలిగిన నూతన ప్రజాతంత్ర వ్యవస్థ నిర్మాణమే ఈ దోపిడీ విధానాలను మార్చగలుగుతుంది.